# క్షణంలో - పగ

ఎర్రగా పండిన టోమోటో చితికినట్టుగా రోడ్డుమీద సాయంత్రపు ఎండ పడుతోంది.

అప్పుడే కాలేజీ వొదిలారు. అందరికంటె చివరివాడుగా సురేష్‌కుమార్ బయటికొచ్చాడు. స్టాటిస్టిక్సులో కలిగిన ఒకసందేహాన్ని లెక్చరర్ను అడిగి తెల్సుకోవడంలో ఆలస్యమైంది. అతను బి. కామ్. ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.

'సురేష్‌కుమార్ మంచివిద్యార్థి. అన్ని సబ్జక్టుల్లోనూ ఫస్టుమార్కులు తెచ్చుకుంటాడు.' అంటారు లెక్చరర్లు. 'సత్ప్రవర్తనలోకూడా అతను ఫస్టుక్రిందే వస్తాడు' అంటాడు ప్రిన్సిపాల్. 'వాడు పుస్తకాల పురుగు. పుస్తకాలూ, కాలేజీ, క్లాసూలూ - తప్ప మరో ప్రపంచం తెలియని బావిలోని కప్పలాంటివాడు' అంటారు తోటి విద్యార్థులు. అట్లాంటి సురేష్‌కుమార్ ఆ సాయంత్రం అయిదుగంటలవేళ కాలేజీనుంచి ఇంటికి బయలుదేరి కాచిగూడా స్టేషనురోడ్డు ఎక్కాడు.

హఠాత్తుగా రోడ్డుమీద నడిచిపోతూన్న ఓ వ్యక్తిని చూశాడు. వయస్సు యాభై యేళ్లు వుంటాయి. కొంచెంగా నెరిసినగడ్డం, బుర్రమీసాలు, క్రూరమైన మొహం, సామాన్యమైన దుస్తులు. ఆ వ్యక్తి కేసి దృష్టినిలిపి కొన్ని క్షణాల పాటు తీవ్రంగా చూశాడు సురేష్‌కుమార్. వెంటనే అతని మొహంలో రంగులు మారాయి. మొహం జేవురించింది. కళ్లు చింతనిప్పులైనాయి. పెదవులు వొణికాయి. వొళ్ళు కంపించింది. తల వెంట్రుకలు నిక్కపొడుచుకున్నాయి. రక్తనాళాలు కదంత్రొక్కసాగాయి. కాళ్ళక్రింద భూమి రెండుగా విచ్చిపోతూన్నది. శరీరమంతా కోపోద్రేకాల ద్వేషంతో, కసితో, ఆవేశంతో కుతకుతలాడిపోతోంది. ఏదో అవ్యక్తమైన ప్రేరణ ఉవ్వెత్తుగా లేచి మనస్సునంతా అగ్నిగుండంగా మార్చింది.

---

తాళ్లూరు నాగేశ్వరరావు

దగ్గర్లోవున్న సైకిలుషాపులోకి వెళ్ళి ఓ ఇనపకడ్డీ తీసికున్నాడు సురేష్ కుమార్. పరుగెత్తుకుంటూ వెళ్ళి రోడ్డుమీదపోతూన్న ఆ వ్యక్తి తలమీద బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు ఆ వ్యక్తి తల రెండుగాచీలింది. మెదడు బయటి కొచ్చింది. రక్తం ఎర్రగా విరజిమ్మింది. రోడ్డుమీద వొరిగిపోయాడు. ఆ మరు క్షణంలోనే మరణించాడు.

సురేష్‌కుమార్ ఆ శవంప్రక్కనే నిలబడ్డాడు గంభీరమైన భ్రాంత్యావేశుడై. అయిదు నిముషాల తర్వాత పోలీసులు అతన్ని పట్టుకొని స్టేషనుకు తీసికెళ్లారు

* * * *

కోర్టులో హత్యావిచారణ ప్రారంభమైంది.

హత్యకుగల కారణాల్ని పోలీసులు తీవ్రంగా పరిశోధించారు. కాని వాళ్ళ కేమీ లంగరందలేదు. కొండను సొంతం త్రవ్వినా ఎలుకకూడా బయటపడలేదు. గవర్నమెంటు హాస్పటల్‌కు చెందిన మానసిక విశ్లేషణావేత్తలు ఆ కేసును చేపట్టారు. విపరీతమైన పరిశోధన చేయసాగారు.

కోర్టులో కేసు విచారణదశలోనే ఉంది.

ఓ నెలరోజుల తర్వాత మానసిక విశ్లేషణవేత్తలు కోర్టువారికి తమ నివేదిక సమర్పించారు. అందులోని సారాంశం: "దాదాపు పదిహేనుసంవత్సరాల క్రితం సురేష్‌కుమార్ తండ్రి హత్యగావింపబడ్డాడు. అప్పుడు సురేష్ కుమార్ వయస్సు ఏడేళ్లు. ఆ హత్య సురేష్‌కుమార్ కళ్ళముందే జరిగింది. హంతకుని భీకరమైన ముఖం ఇన్నేళ్ళూ అతని మనసులో చెరగనిముద్రలా వుండిపోయింది. వయస్సు ముదరటంతో అతని గుండెల్లో అతనికి తెలీకుండానే ప్రతీకార వాంఛకూడా ముదిరిపోయింది. సురేష్‌కుమార్‌కు ఆరోజు సాయంత్రం రోడ్డుమీద తటస్థ పడ్డ వ్యక్తి ముఖానికీ, నాటి హంతకుని ముఖానికి తేడా లేకుండా కనపడేసరికి హఠాత్తుగా అతనిలో ప్రతీకారద్వేషం, పగా ప్రజ్వరిల్లి ఆ వ్యక్తిని హత్య చేయడానికి పురిగొల్పాయి. హంతకుడూ, హత్యకాబడ్డవ్యక్తీ కవలలని బుజువు కావడం, ఈ కేసులో ప్రధానమైన విశేషం."